మన చౌరాస్తా
తెలుగు దినపత్రిక

సంపుటి : 01 | సంచిక : 182 | ఎడిటర్ : ఉప్పలంచి నరేందర్ | మంగళవారం, 02 జూన్ 2026 | పేజీలు : 4



## మేం అధికారంలోకి వస్తే ఆంధ్రోళ్ల విగ్రహాలు తొలగిస్తాం

- టీఆర్ఎస్ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత

3






# వకీల్ సాబ్



## అయ్యో పాపం.. ఎరక్కపోయి ఇరుకున్నాడా..!

2

'ఎర్ర' లొల్లిలో నలిగిపోయిన 'నల్ల' కోర్టు

నువ్వే మేధావి అంటూ ముందుకు నెట్టి వెనక్కు తగ్గారా..?

అలీ సాబ్.. ఎరక్కపోయి ఇరుకున్నాడా..!

సోషల్ మీడియాలో జోరుగా ట్రోలింగ్..!

'వకీల్ సాబ్.. నువ్వే మేధావివి.. జనగామలో నీకంటూ ఓ ప్రత్యేక స్థానం ఉంది. నీకు అన్ని వర్గాల మద్దతు ఉంది. పట్టు పడితే విక్రమార్కుడు అనే పేరు కూడా ఉంది..' అంటూ జనగామకు చెందిన ప్రముఖ హైకోర్టు న్యాయవాది సాదిక్ అలీని కొందరు మునగ చెట్టు ఎక్కించారా..! అంటే అవును అనే సమాధానం వస్తోంది. అలా వారి వ్యూహంలో చిక్కుకొని పాపం వకీల్ సాబ్.. అనుకున్న దారిని మర్చిపోయాడో..? లేక దారి తప్పించారో..? తెలియదు గానీ ఒక్కసారిగా ఆయనకు ఉన్న ఇమేజ్ అంతా మసకబారిపోయింది. అరే మన 'వకీల్ సాబ్..' ఏందీ ఇలా రచ్చ... రచ్చ.. చేస్తున్నాడు. 'గోరుతో పోయేదాన్ని గొడ్డలి దాకా తెచ్చినట్టు' అన్న చందంగా తయారైండు.. అని జోరుగా చర్చ జరుగుతోంది. జనగామలో ఏ హోటల్లో చూసినా.. ఏ నలుగురు కలిసినా ఇప్పుడు అంతట అదే చర్చ..!

- ఉప్పలంచి నరేందర్, మన చౌరాస్తా

---

## డామిడ్..కథ అడ్డం తిరిగింది!



2 లో

### మళ్లీ తెరపైకి 'వనిత టీ స్టాల్'

- సీపీఎం స్వార్థ రాజకీయాల కోసం మమ్మల్ని వాడుకున్నరు
- వనిత టీ స్టాల్ యజమాని మంజుల ఆరోపణ

## రక్షణ కమిటీ కాదు.. భక్షణ కమిటీ

- నాయ్యం పేరుతో అక్రమ వసూళ్లు
- అప్పుల పాలవుతున్న అమాయకులు

పూర్తి వివరాలు మరో సంచికలో..






# వకీల్ సాబ్



## అయ్యో పాపం.. ఎరక్కపోయి ఇరుక్కున్నాడా..!

**'ఎర్ర' లొల్లిలో నలిగిపోయిన 'నల్ల' కోర్టు**

**నువ్వే మేధావి అంటూ ముందుకు నెట్టి వెనక్కు తగ్గారా..?**

**అలీ సాబ్.. ఎరక్కపోయి ఇరుకున్నాడా..!**

**సోషల్ మీడియాలో జోరుగా ట్రోలింగ్..!**

**ఉప్పలంచి నరేందర్, మన చౌరాస్తా :**

'వకీల్ సాబ్.. నువ్వే మేధావివి.. జనగామలో నీకంటూ ఓ ప్రత్యేక స్థానం ఉంది. నీకు అన్ని వర్గాల మద్దతు ఉంది. పట్టు పడితే విక్రమార్కుడు అనే పేరు కూడా ఉంది..' అంటూ జనగామకు చెందిన ప్రముఖ హైకోర్టు న్యాయవాది సాదిక్ అలీని కొందరు మునగ చెట్టు ఎక్కించారా..! అంటే అవును అనే సమాధానం వస్తోంది. అలా వారి వ్యూహంలో చిక్కుకొని పాపం వకీల్ సాబ్.. అనుకున్న దారిని మర్చిపోయాడో..? లేక దారి తప్పించారో..? తెలియదు గానీ ఒక్కసారిగా ఆయనకు ఉన్న ఇమేజ్ అంతా మసకబారిపోయింది. అరే మన 'వకీల్ సాబ్..' ఏందీ ఇలా రచ్చ... రచ్చ.. చేస్తున్నాడు. 'గోరుతో పోయేదాన్ని గొడ్డలి దాకా తెచ్చినట్టు' అన్న చందంగా తయారైందు.. అని జోరుగా చర్చ జరుగుతోంది. జనగామలో ఏ హోటల్లో చూసినా.. ఏ నలుగురు కలిసినా ఇప్పుడు అంతట అదే చర్చ..

### అసలేం జరిగింది..

కలెక్టర్గా సందీప్ కుమార్ ఝా ఫిబ్రవరి 26న జనగామ జిల్లా కలెక్టర్గా బాధ్యతలు స్వీకరించారు. అయితే ఆయన విధుల్లో చేరిన మూడు నెలలు పూర్తయ్యింది. వచ్చిన తొలినాళ్ల నుంచే ఆయన కలెక్టరేట్ పరిపాలన వ్యవహారంపై ప్రత్యేక దృష్టి సారించారు. పైరవీలు, రాజకీయాలకు స్వస్తి పలికి పారదర్శక పాలనకు పెద్దపీట వేస్తూ ముందుకు సాగుతున్నారు. ఇదే క్రమంలో కలెక్టరేట్ గోడకు ఆనుకుని ఉన్న వనితా టీ స్టాల్, పాల డేయిరీ ఆయన అక్కడి నుంచి తొలగించి వేరే ప్రాంతాల్లో పెట్టుకోవాలని సూచించారు. అయితే దానిని ప్రజా సంఘాలు వ్యతిరేకిస్తూ నిరసనకు దిగారు. ఒక దశలో స్థానిక ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి సైతం కలెక్టర్ పై అంబేద్కర్ జయంతి నాడు అంబేద్కర్ సాక్షిగా తీవ్ర విమర్శలు చేశారు. అది కాస్త చిలికిచిలికి గాలి వానగా మారి కోర్టుల వరకు వెళ్లడం కోర్టు అధికారులకు అనుకూలంగా తీర్పు ఇవ్వడంతో వాటిని తొలగించారు. ఆ తర్వాత కలెక్టరేట్ లోకి వాహనాల రాకపోకలు, క్రమబద్ధీకణపై కార్యాలయ అధికారులు చర్యలు తీసుకున్నారు. దీనిని కూడా కొందరు వ్యతిరేకించడంపై కార్యాలయ అధికారులు మీడియా ద్వారా చేపట్టిన చర్యలపై వివరణ ఇచ్చారు. ఇక్కడి నుంచే అసలు కథ మొదలైంది. అప్పటి వరకు తెరమీదకు రాని 'వకీల్ సాబ్ సాదిక్ అలీ'ని కొందరు ప్రజాసంఘాల నాయకులు ఉసిగొలిపి కలెక్టర్ ప్రత్యేక్ష దాడికి దించినట్టు తెలుస్తోంది.

### కలెక్టర్ బాధితుల రక్షణ పేరుతో..



నాయ్యవాది సాదిక్ అలీ మే 11న జరిగిన ప్రజావాణి కార్యక్రమానికి ఏదో సమస్యపై వెళ్లి కలెక్టర్ సందీప్ కుమార్ ఝూతో మాట్లాడారు. అయితే మరుసటి రోజే 12వ తేదీన కలెక్టర్ బాధితుల రక్షణ కమిటీ పేరుతో ఆయన కొంత మంది ప్రజాసంఘాలు, కొందరు జర్నలిస్టులతో పాటు న్యాయవాదులు, వృత్తిదారుల సంఘాలు, ఆటో, ట్రాలీ యూనియన్ల నాయకులతో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ప్రధానంగా కలెక్టర్ వ్యవహార శైలి మార్చుకోవాలంటూ డిమాండ్ చేశారు. అయితే మరుసటి రోజు 13వ తేదీన కలెక్టర్ బాధితుల రక్షణ కమిటీకి కన్వీనర్గా సాదిక్ అలీని నియమించారు. అంతే.. ఆ తర్వాత కమిటీ కన్వీనర్గా ఆయన మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ప్రభుత్వ ఉన్నతాధికారులను కలిసి కలెక్టర్ పై ఫిర్యాదు చేశారు. వాటిని సోషల్ మీడియాలో పెట్టడడమే పనిగా పెట్టుకున్నారు.

### ఇంటికి కొలతలతో..

ఈ నెల 19న న్యాయవాది సాదిక్ అలీ ఇంటి కొలతల కోసం మున్సిపల్ కమిషనర్ మహేశ్వర్ రెడ్డి ఆయన ఇంటికి రావడంతో మరింత రచ్చ మొదలైంది. కలెక్టర్ సందీప్ కుమార్ ఝా కక్ష గట్టి తనపైకి పంపారు అంటూ సాదిక్ అలీ ఆరోపించారు. అంతటితో ఆగకుండా మరో అడుగుముందుకేసి ఆమరణ దీక్షకు దిగారు. తాను చస్తేగానీ కలెక్టర్ పై చర్యలు తీసుకోరా.. అంటూ ప్రభుత్వంపై మండిపడ్డారు. అయితే ఆ దిక్షను మరుసటి రోజు జనగామ మున్సిపల్ చైర్పర్సన్ బాలమణి, మార్కెట్ చైర్మన్ బనుక శివరాజ్ యాదవ్, మరి కొందరు నాయకులు వెళ్లి విరమింపచేశారు. ఒక మున్సిపల్ కమిషనర్ ఇంటి కొలతలకు వెళ్లాడని దీక్షకు దిగిన ఆయనను మున్సిపల్ చైర్పర్సన్ వెళ్లి దీక్ష విరమింపజేయడం వెనుక ఆంతర్యం ఏమిటని అంతా చర్చించుకుంటున్నారు. ఇదిలా ఉంటే సదరు మున్సిపల్ కమిషనర్ మహేశ్వర్ రెడ్డి మూడు రోజుల బదిలీ కావడం గమనార్హం. అయితే దీక్ష విరమణ సమయంలో ఎందుకు విరమించడం అంటూ కొందరు వారించినట్టు తెలిసింది. సమస్యను పక్కదారి పట్టించి మరింత పెద్దది చేయాలనే కుట్రతోనే వారు ఉన్నరనేది స్పష్టం అవుతుంది.

### సోషల్ మీడియాలో ట్రోలింగ్

**ఆమరణ దీక్ష అంటూ ఆందోళనకు దిగన వకీల్ సాబ్ ఒక్క రోజుతో ముగించడంతో ఆయనను కొందరు సోషల్ మీడియాలో ట్రోలింగ్ చేస్తున్నారు.**

**'ఆమరణం అంటే.. నీకు తెలుసా..' 'ఎరక్కపోయి ఇరుకున్నాడు..' అంటూ వీడియోలు ఫొటోలు పెడుతూ ట్రోల్ చేస్తున్నారు. దీంతో సదరు వకీల్ సాబ్ తరపున కొందరు ట్రోలింగ్ ను ఆపాలని సంది బేరానికి కూడా వెళ్లినట్టు తెలిసింది.**






# డామిడ్..కథ అడ్డం తిరిగింది!

- **మళ్లీ తెరపైకి 'వనిత టీ స్టాల్'**
- **సీపీఎం స్వార్ధ రాజకీయాల కోసం మమ్మల్ని వాడుకున్నరు**
- **వనిత టీ స్టాల్ యజమాని మంజుల ఆరోపణ**

**జనగామ, మన చౌరాస్తా :** డామిడ్ వనిత టీ స్టాల్ కథ.. అడ్డం తిరిగింది!.. 'సీపీఎం నాయకుల స్వార్థ రాజకీయాల కోసం నిరక్షరాస్యులపైన తమను ముందు పెట్టి కలెక్టర్‌పై కేసు పెట్టించారు..' అంటూ సదరు టీ స్టాల్ యజమాని ఎర్రగొల్లపహాడ్ కు చెందిన పాలమాకుల చిన్న మంజుల, కనకయ్య ఆరోపించారు. ఈ మేరకు సోమవారం జరిగిన ప్రజావాణిలో కలెక్టర్ సందీప్ కుమార్ ఝాను కలిసి వినతి పత్రం అందజేశారు. దళిత సామాజిక వర్గానికి చెందిన తాము నిరక్షరాస్యులమని, సీపీఎం నాయకులు తమ అమాకత్వాన్ని ఆసరాగా చేసుకునియ మమ్మల్ని ముందుపెట్టి కోర్టులో కేసు వేయించారని వివరించారు. దానిని తాము వెనక్కు తీసుకుంటామని, తమరి హోదాకు భంగం కలిగించినందుకు పశ్చాతాపడుతున్నామని, తమను క్షమించాలని కోరారు. కలెక్టర్ కార్యాwలయ ప్రాంగణంలో వీలుపడకపోతే, ప్రత్యామ్నాయంగా స్థానిక ఎంపీడీవో లేదా జనగామలో కొత్తగా ఏర్పడుతున్న ప్రభుత్వ మెడికల్ ప్రాంగణంలో గానీ లేదా తమరు చూపిన ప్రత్యామ్నాయ స్థలంలో వనిత టీ స్టాల్ ఏర్పాటు చేసుకునేందుకు అవకాశం ఇవ్వాలని వేడుకున్నారు.



# రైల్వే స్టేషన్ రెండో ఎంట్రీని తెరవండి

- **రైల్వే సూపరింటెండెంట్‌కు బీజేపీ నాయకుల వినతి**

**జనగామ, మన చౌరాస్తా :** జనగామ రైల్వే స్టేషన్ అభివృద్ధి పనులలో భాగంగా రెండో ప్లాట్ ఫారానికి ఉన్న ద్వారాన్ని మూసివేయడంతో స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని బీజేపీ నాయకులు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సమస్యను పరిష్కరించాలని కోరుతూ రైల్వే సూపరింటెండెంట్‌కు వినతిపత్రం సమర్పించారు. గత 30 ఏళ్లుగా వినియోగంలో ఉన్న ఈ ద్వారం గిర్నిగడ్డ, లక్ష్మీబాయికుంట, గ్రెయిన్ మార్కెట్, వివర్స్ కాలనీ, చీటకోడూరు, చౌడారం, వడ్లకొండ ప్రాంతాల ప్రజలకు రాకపోకలకు ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. ద్వారం మూసివేయడంతో ప్రయాణికులు అదనంగా రెండు నుంచి మూడు కిలోమీటర్లు ప్రయాణించాల్సి వస్తోందని, ఫలితంగా సమయానికి రైలును అందుకోలేక ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. ప్రజల సౌకర్యార్థం రెండో ప్లాట్ ఫారం ద్వారాన్ని వెంటనే పునరుద్ధరించాలని రైల్వే అధికారులను కోరారు. అదేవిధంగా జనగామ పట్టణంలోని 11వ వార్డులో పశువైద్యశాల



సమీపంలో ఉన్న చిన్న మోరి శిథిలావస్థకు చేరుకుందని, ప్రమాదాలు జరిగే అవకాశం ఉన్నందున దానిని కూడా వెంటనే మరమ్మతు చేయాలని రైల్వే సూపరింటెండెంట్ దృష్టికి తీసుకెళ్లారు. ఈ కార్యక్రమం బీజేపీ నాయకుడు శోభనబోయిన సంపత్ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించగా, బీజేపీ రాష్ట్ర నాయకులు శోభనబోయిన శివరాజ్ యాదవ్, పట్టణ అధ్యక్షుడు బొమ్మకంటి అనిల్, పట్టణ ఉపాధ్యక్షుడు బింగి రమేష్ పాల్గొన్నారు.




## టీఆర్ఎస్ అధికారంలోకి వస్తే

# ఆంధ్రోళ్ల విగ్రహాలు తొలగిస్తాం

- **తెలంగాణ అస్తిత్వంపై దాడులు సహించం**
- **టీఆర్ఎస్ చీఫ్ కవిత**

**హైదరాబాద్, మన చౌరాస్తా :** తెలంగాణ అమరుల త్యాగాలు, ఉద్యమకారుల పోరాట ఫలితంగా ఏర్పడిన తెలంగాణ రాష్ట్రంపై ఆంధ్రా రాజకీయ నాయకుల పెత్తనాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని టీఆర్ఎస్ చీఫ్ కల్వకుంట్ల కవిత స్పష్టం చేశారు. సోమవారం బంజారాహిల్స్‌లోని తెలంగాణ రక్షణ సేన కార్యాలయంలో నిర్వహించిన 'ఉద్యమకారుల ఆకాంక్షలు - సాధన' అంశంపై రౌండ్ టేబుల్ సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. తెలుగు ప్రజలు రెండు రాష్ట్రాలుగా విడిపోయినా పరస్పర విభేదాలు లేకుండా కలిసి జీవిస్తున్నారని, అయితే కొందరు రాజకీయ నాయకులు తెలంగాణ అస్తిత్వంపై దాడి చేస్తూ పెత్తనం చేయాలని చూస్తున్నారని విమర్శించారు. తెలంగాణ అస్తిత్వాన్ని కాపాడే బాధ్యత తెలంగాణ రక్షణ సేనదేనని పేర్కొన్నారు. తెలంగాణలో ఆంధ్రా రాజకీయ నాయకుల విగ్రహాల ఏర్పాటు తమ అస్తిత్వంపై దాడిగా భావిస్తున్నామని కవిత అన్నారు. తెలంగాణ రక్షణ సేన అధికారంలోకి వచ్చిన వెంటనే అలాంటి విగ్రహాలను తొలగించి ఆంధ్రప్రదేశ్‌కు పంపిస్తామని వ్యాఖ్యానించారు. ఆంధ్రప్రదేశ్‌లో తెలంగాణ నాయకులైన పీవీ నరసింహారావు, ప్రొఫెసర్ జయశంకర్‌తో పాటు తెలంగాణ అమరవీరుల విగ్రహాలు ఏర్పాటు చేస్తారా అని ప్రశ్నించారు.

**ఆంధ్రా ఏజెంట్ రేవంత్ రెడ్డి..**

తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి ఆంధ్రా రాజకీయ నాయకుల ఏజెంట్‌లా వ్యవహరిస్తున్నారని కవిత ఆరోపించారు. ఆయన సహకారంతోనే తెలంగాణపై కుట్రలు జరుగుతున్నాయని విమర్శించారు. తెలంగాణ మేధావులపై ఆంధ్రా పోలీసులు చర్యల గురించి హెచ్చరికలు చేయడం ఆందోళనకరమని పేర్కొన్నారు. తెలంగాణలో సభలు నిర్వహిస్తామంటున్న జనసేన అధినేత పవన్ కళ్యాణ్, పార్టీ విస్తరణ గురించి మాట్లాడుతున్న టీడీపీ నేత నారా లోకేష్‌లపై కూడా కవిత స్పందించారు. ప్రజాస్వామ్యంలో ఎవరైనా సభలు పెట్టుకోవచ్చని, కానీ తెలంగాణ ప్రయోజనాలకు విరుద్ధంగా వ్యవహరిస్తే ప్రజలు గమనిస్తారని హెచ్చరించారు. తెలంగాణ అస్తిత్వంపై ఎవరైనా కన్నేస్తే సహించేది లేదని స్పష్టం చేశారు.

# సమాచార హక్కు సాధన కమిటీ హనుమకొండ జిల్లా ఉపాధ్యక్షుడిగా మణిదీప్




**భీమదేవరపల్లి, మన చౌరాస్తా :** సమాచార హక్కు చట్టం (ఆర్‌టీఐ) ద్వారా ప్రజలకు న్యాయం చేకూర్చడం, ప్రభుత్వ పాలనలో పారదర్శకత పెంపొందించడం, ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్న యువ సామాజిక కార్యకర్త రంగు మణిదీప్‌కు పదోన్నతి లభించింది. హనుమకొండ జిల్లా సమాచార హక్కు సాధన కమిటీలో జిల్లా ఉపాధ్యక్షుడిగా ఆయనను రాష్ట్ర కమిటీ నియమించింది. హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం గట్ల నర్సింగాపూర్ గ్రామానికి చెందిన రంగు మణిదీప్ గత కొన్నేళ్లుగా సమాచార హక్కు చట్టంపై ప్రజల్లో అవగాహన కల్పించడం, ప్రభుత్వ కార్యాలయాల్లో పారదర్శకత కోసం కృషి చేయడం వంటి కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటున్నారు. జిల్లా సహాయ కార్యదర్శిగా బాధ్యతలు నిర్వహించిన సమయంలో సంస్థ బలోపేతం, సభ్యత్వ విస్తరణ, ప్రజా సమస్యల పరిష్కారానికి సంబంధించిన ఉద్యమాల్లో విశేష సేవలందించారు. ఆయన సేవలను, సంస్థ పట్ల అంకితభావాన్ని గుర్తించిన రాష్ట్ర కమిటీ జిల్లా ఉపాధ్యక్ష పదవికి పదోన్నతి కల్పించింది. ఈ నియామకంతో జిల్లాలో సమాచార హక్కు ఉద్యమానికి మరింత బలం చేకూరుతుందని కమిటీ నాయకులు అభిప్రాయపడ్డారు. ఈ సందర్భంగా రంగు మణిదీప్ మాట్లాడుతూ.. తనపై నమ్మకం ఉంచి మరింత బాధ్యతాయుతమైన పదవిని అప్పగించిన రాష్ట్ర కమిటీకి కృతజ్ఞతలు తెలిపారు.

# భీమదేవరపల్లిలో బెల్టుషాపులు బ్యాన్

- **గ్రామసభలో ఏకగ్రీవ తీర్మానం**

**భీమదేవరపల్లి, మన చౌరాస్తా:** గ్రామ ప్రజల ఆరోగ్యం, కుటుంబాల సంక్షేమం, యువత భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని భీమదేవరపల్లి గ్రామపంచాయతీ పాలకవర్గం కీలక నిర్ణయం తీసుకుంది. గ్రామంలో అక్రమంగా నిర్వహిస్తున్న బెల్ట్ షాపులను పూర్తిగా నిర్మూలించాలని సోమవారం నిర్వహించిన గ్రామ పంచాయతీ సమావేశంలో ఏకగ్రీవంగా తీర్మానించింది. గ్రామీణ ప్రాంతాల్లో బెల్ట్ షాపుల వల్ల కుటుంబాలు ఆర్థికంగా దెబ్బతినడం, గృహ కలహాలు పెరగడం, యువత మద్యానికి బానిసలుగా మారడం వంటి సమస్యలు అధికమవుతున్న నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు సభ్యులు తెలిపారు. గ్రామాభివృద్ధికి మద్యం ప్రధాన అడ్డంకిగా మారిందని అభిప్రాయపడిన పాలకవర్గం, సమాజ హితం కోసం కఠిన చర్యలు అవసరమని పేర్కొంది. ఈ సందర్భంగా ప్రజా ప్రతినిధులు మాట్లాడుతూ గ్రామంలో ప్రశాంత వాతావరణం నెలకొల్పడం, మహిళల భద్రతను పెంపొందించడం, యువతను చెడు అలవాట్లకు దూరంగా ఉంచడం, కుటుంబాల ఆర్థిక స్థితిని మెరుగుపరచడం లక్ష్యంగానే ఈ తీర్మానం చేసినట్లు వెల్లడించారు. గ్రామస్థుల సహకారంతో బెల్ట్ షాపుల నిర్మూలనను పూర్తిస్థాయిలో అమలు చేస్తామని స్పష్టం చేశారు. సమావేశంలో సర్పంచ్ మాచర్ల కుమారస్వామి, ఉపసర్పంచ్ శనిగరం అయిలయ్య, గ్రామ కార్యదర్శి రాజు, వార్డు సభ్యులు ప్రేమలత, సదానందం, శ్రీనివాస్ రెడ్డి, పోలు అశోక్, సాగంటి వెంకటేశ్వర్లు, బొల్లంపల్లి శ్యామ్, విజయ, సంధ్య తదితరులు పాల్గొన్నారు.

# చావులకు డప్పు కొట్టం..

**– గోవర్ధనగిరిలో ఎస్సీల సంచలన నిర్ణయం**

**రఘునాథపల్లి, మన చౌరాస్తా:** సామాజిక స్వేచ్ఛ, ఆత్మగౌరవ సాధన దిశగా రఘునాథపల్లి మండలం గోవర్ధనగిరి గ్రామానికి చెందిన ఎస్సీ మాదిగ కులస్తులు చారిత్రాత్మక నిర్ణయం తీసుకున్నారు. ఇకపై గ్రామంలో జరిగే మరణాలు, పండుగలు, శుభకార్యాలు లేదా ఇతర వేడుకల సందర్భాల్లో డప్పు కొట్టే సంప్రదాయ కుల వృత్తిని కొనసాగించబోమని ఏకగ్రీవంగా తీర్మానించారు. గ్రామంలోని మాదిగ కుల పెద్దలు, యువకులు, మహిళలు సమావేశమై ఈ నిర్ణయాన్ని తీసుకున్నారు. తమ సామాజిక పురోగతి, సమాన హక్కులు, గౌరవప్రదమైన జీవితం కోసం ఈ నిర్ణయం అవసరమని వారు పేర్కొన్నారు. అనంతరం ఈ తీర్మానానికి సంబంధించిన పత్రాన్ని గ్రామ సర్పంచ్‌కు అందజేసి తమ నిర్ణయాన్ని అధికారికంగా తెలియజేశారు. కుల వృత్తుల పేరుతో కొనసాగుతున్న సామాజిక వివక్షకు స్వస్తి పలికి, ఆత్మగౌరవంతో జీవించాలనే సంకల్పంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా కుల పెద్దలు మాట్లాడుతూ, సమాజంలో మార్పు కోసం ప్రతి ఒక్కరూ ఐక్యంగా ముందుకు రావాలని, గ్రామంలోని ఎస్సీ మాదిగ కులస్తులందరూ ఈ తీర్మానానికి కట్టుబడి ఉండాలని పిలుపునిచ్చారు. గోవర్ధనగిరి గ్రామంలో తీసుకున్న ఈ నిర్ణయం సామాజిక చైతన్యానికి నిదర్శనంగా నిలుస్తుందని పలువురు అభిప్రాయపడ్డారు.





# బంజరు మాటు అభివృద్ధికి రూ.1.92 కోట్ల నిధులు

**– ఎమ్మెల్యే కడియం శ్రీహరికి రైతుల కృతజ్ఞతలు**

**స్టేషన్ ఘనపూర్, మన చౌరాస్తా:** స్టేషన్ ఘనపూర్ మండలం పామునూర్ గ్రామంలోని బంజరు మాటు అభివృద్ధి కోసం రూ.1.92 కోట్ల నిధులు మంజూరు కావడంతో గ్రామ రైతులు, ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సోమవారం హన్మకొండలోని తన నివాసంలో ఎమ్మెల్యే, మాజీ ఉప ముఖ్యమంత్రి కడియం శ్రీహరిని కలిసి రైతులు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న బంజరు మాటు అభివృద్ధి పనులకు చొరవ తీసుకుని నిధులు మంజూరు చేయించడంపై గ్రామస్థులు ఎమ్మెల్యేకు ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా కడియం శ్రీహరి నిధుల మంజూరుకు సంబంధించిన ప్రొసీడింగ్ కాపీని రైతులకు అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ, బంజరు మాటు అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేసి పామునూర్ గ్రామ రైతులకు రెండు పంటలకు సరిపడా సాగునీరు అందేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.



# బక్రీద్ ఏర్పాట్లపై కలెక్టర్‌కు థాంక్స్

**జనగామ, మన చౌరాస్తా:** ఈద్ ఉల్ అజ్హా (బక్రీద్) పర్వదినం సందర్భంగా జనగామ ఈద్గా వద్ద ముస్లిం సోదరుల సౌకర్యార్థం ప్రత్యేక ఏర్పాట్లు చేసిన జిల్లా కలెక్టర్ జనాబ్ సందీప్ కుమార్ ఝా గారికి ముస్లిం డెవలప్‌మెంట్ కమిటీ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపింది. ఈ సందర్భంగా కమిటీ అధ్యక్షులు, అడ్వకేట్ జమాల్ షరీఫ్ మాట్లాడుతూ, ఈద్గా వద్ద తీవ్రమైన ఎండలను దృష్టిలో ఉంచుకొని మున్సిపల్ కమిషనర్, మున్సిపల్ చైర్మన్‌లను ఆదేశించి టెంట్ ఏర్పాటు చేయించడమే కాకుండా, మెడికల్ క్యాంప్, ఫైర్ ఇంజన్, తాగునీటి సదుపాయాలను కల్పించినందుకు జిల్లా కలెక్టర్‌కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

# ప్రజావాణిలో వినతి.. గంటల్లోనే సమస్య పరిష్కారం

- **కలెక్టర్ చొరవతో సొంతింట్లోకి వృద్ధురాలు**



**జనగామ, మన చౌరస్తా:** జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఆధ్వర్యంలో ప్రతి సోమవారం నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమం ప్రజల సమస్యల పరిష్కారానికి వేదికగా నిలుస్తోంది. ప్రజావాణిలో అందిన అర్జీలను జిల్లా యంత్రాంగం ప్రాధాన్యతతో పరిశీలిస్తూ, సాధ్యమైన సమస్యలను వెంటనే పరిష్కరిస్తోంది. ఈ క్రమంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జనగామ పట్టణానికి చెందిన వృద్ధురాలు పబ్బాని నరసమ్మ కలెక్టర్‌ను కలిసి తన గోడును వినిపించారు. తన ఇద్దరు కుమారులు తనను పట్టించుకోవడం లేదని, పోషణ బాధ్యత తీసుకోవడం లేదని, భర్త పబ్బాని నర్సయ్యకు చెందిన వివర్స్ కాలనీలోని ఇంట్లో నివసించలేక ప్రస్తుతం అద్దె గదిలో ఉంటున్నానని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. ఆర్థిక ఇబ్బందులు తీవ్రంగా ఉన్నాయని పేర్కొంటూ తనకు న్యాయం చేయాలని ప్రజావాణిలో వినతిపత్రం సమర్పించారు. వృద్ధురాలి సమస్యను సానుభూతితో విన్న కలెక్టర్ సందీప్ కుమార్ ఝా వెంటనే స్పందించి రెవెన్యూ అధికారులను సంఘటనా స్థలానికి పంపించి క్షేత్రస్థాయి విచారణ చేపట్టాలని ఆదేశించారు. అధికారులు వెంటనే అక్కడికి చేరుకుని పరిస్థితులను పరిశీలించి, ఆమె కుమారులు మరియు కుటుంబ సభ్యులతో మాట్లాడారు. తల్లి పోషణ బాధ్యతను చేపట్టాలని కౌన్సెలింగ్ నిర్వహించగా, ఇకపై ఆమెను నిర్లక్ష్యం చేయబోమని, తమతోనే ఉంచుకుంటామని వారు హామీ ఇచ్చారు. కలెక్టర్ ప్రత్యేక చొరవతో అదే రోజున సమస్యకు పరిష్కారం లభించగా, పబ్బాని నరసమ్మ తన సొంత ఇంట్లోనే నివసించేలా అధికారులు ఏర్పాట్లు చేశారు. సమస్య త్వరితగతిన పరిష్కారం కావడంతో వృద్ధురాలు కలెక్టర్‌కు, జిల్లా యంత్రాంగానికి కృతజ్ఞతలు తెలిపారు.






# కలెక్టర్ పని తీరుపై ప్రజలు హ్యాపీ

- **మున్సిపల్ చైర్‌పర్సన్ కడకంచి బాలమణి**

**జనగామ, మన చౌరాస్తా:** జనగామ కలెక్టర్ పని తీరుపై ప్రజలు హ్యాపీగా ఉన్నారని మున్సిపల్ చైర్‌పర్సన్ కడకంచి బాలమణి శ్రీనివాస్ అన్నారు. జనగామ మున్సిపాలిటీకి నూతనంగా బాధ్యతలు స్వీకరించిన మున్సిపల్ కమిషనర్ సిహెచ్.రాజశేఖర్ రెడ్డిని ఆమె సన్మానించారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా నాయకత్వాన్ని ప్రశంసిస్తూ, ప్రజా సమస్యల పరిష్కారంలో ఆయన చూపుతున్న చొరవతో జిల్లా ప్రజలు సంతృప్తిగా ఉన్నారని పేర్కొన్నారు. జిల్లా అభివృద్ధి, ప్రజా సంక్షేమ కార్యక్రమాల అమలు, పట్టణాభివృద్ధి పనుల పర్యవేక్షణలో కలెక్టర్ ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారని, ప్రజల అవసరాలను గుర్తించి వెంటనే స్పందించడం ద్వారా జిల్లాను అభివృద్ధి పథంలో నడిపిస్తున్నారని కొనియాడారు. మున్సిపాలిటీ పరిధిలో చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలకు జిల్లా యంత్రాంగం నుంచి పూర్తి సహకారం లభిస్తోందని తెలిపారు. అలాగే నూతన కమిషనర్ రాకతో జనగామ మున్సిపాలిటీలో మరింత సమర్థవంతమైన పరిపాలన అందించగలమనే విశ్వాసాన్ని వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# ఎంపీడీవో ఆఫీసు సిబ్బందిపై విచారణ

- **ఆర్‌టీఐ యాక్టివిస్ట్ ఫిర్యాదుకు స్పందించిన కలెక్టర్**



**జనగామ, మన చౌరస్తా:** నర్మెట్ట మండలానికి చెందిన ఆర్‌టీఐ ఆక్టివిస్ట్ మొహమ్మద్ తఫ్జీల్ సోమవారం జిల్లా కలెక్టర్ నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ఫిర్యాదు సమర్పించారు. నర్మెట్ట ఎంపీడీవో కార్యాలయంలో పనిచేస్తున్న టైపిస్ట్ రత్నాకర్ రెడ్డి తనతో అనుచితంగా ప్రవర్తించారని ఆరోపిస్తూ, ఈ ఘటనపై సమగ్ర విచారణ చేపట్టాలని కోరారు. తన కుటుంబం ఇందిరమ్మ ఇళ్ల పథకం కోసం గతంలో దరఖాస్తు చేసుకుందని, సంబంధిత ప్రక్రియలో మ్యాపింగ్ పూర్తై ప్రస్తుతం తన పేరు ఎల్ 3 కేటగిరీలో ఉందని తెలిపారు. ఈ విషయమై వినతిపత్రం సమర్పించేందుకు కార్యాలయానికి వెళ్లిన సమయంలో అసౌకర్యకర పరిస్థితులు ఎదురయ్యాయని ఫిర్యాదులో పేర్కొన్నారు. ప్రభుత్వ కార్యాలయాలకు వచ్చే ప్రజలతో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని గతంలో సూచించిన తర్వాత తన పట్ల వ్యతిరేక ధోరణి కొనసాగుతోందని ఆరోపించారు. ఇటీవల కూడా తనను భయపెట్టే విధంగా మాట్లాడినట్లు పేర్కొంటూ, దీనివల్ల ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లడానికే ఇబ్బందిగా మారిందని తెలిపారు. ఈ వ్యవహారంపై పూర్తి స్థాయిలో విచారణ నిర్వహించి, ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రజలతో గౌరవప్రదంగా వ్యవహరించేలా తగిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను కోరారు.

నర్మెట్ట మండలానికి చెందిన ఆర్‌టీఐ ఆక్టివిస్ట్ మొహమ్మద్ తఫ్జీల్ సోమవారం జిల్లా కలెక్టర్ నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ఫిర్యాదు సమర్పించారు. నర్మెట్ట ఎంపీడీవో కార్యాలయంలో పనిచేస్తున్న టైపిస్ట్ రత్నాకర్ రెడ్డి తనతో అనుచితంగా ప్రవర్తించారని ఆరోపిస్తూ, ఈ ఘటనపై సమగ్ర విచారణ చేపట్టాలని కోరారు. తన కుటుంబం ఇందిరమ్మ ఇళ్ల పథకం కోసం గతంలో దరఖాస్తు చేసుకుందని, సంబంధిత ప్రక్రియలో మ్యాపింగ్ పూర్తై ప్రస్తుతం తన పేరు ఎల్ 3 కేటగిరీలో ఉందని తెలిపారు. ఈ విషయమై వినతిపత్రం సమర్పించేందుకు కార్యాలయానికి వెళ్లిన సమయంలో అసౌకర్యకర పరిస్థితులు ఎదురయ్యాయని ఫిర్యాదులో పేర్కొన్నారు. ప్రభుత్వ కార్యాలయాలకు వచ్చే ప్రజలతో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని గతంలో సూచించిన తర్వాత తన పట్ల వ్యతిరేక ధోరణి కొనసాగుతోందని ఆరోపించారు. ఇటీవల కూడా తనను భయపెట్టే విధంగా మాట్లాడినట్లు పేర్కొంటూ, దీనివల్ల ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లడానికే ఇబ్బందిగా మారిందని తెలిపారు. ఈ వ్యవహారంపై పూర్తి స్థాయిలో విచారణ నిర్వహించి, ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రజలతో గౌరవప్రదంగా వ్యవహరించేలా తగిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను కోరారు.

Printed and Published by **UPPALANCHI POORNIMA** on behalf of UPPALANCHI POORNIMA, Printed at Hamara Warangal Printers and Graphics H.no.25-8-182, Balaji Nagar, Kazipet, Warangal, 506003., Published at H.No.4-8-65, Dharmakancha, Jangaon, Jangaon District. Telangana, 506167, Editor : **UPPALANCHI NARENDER**. Ph : **8555800812**, RNI : **TGTEL/25/A4350**